ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుడు

# కనులపండువగా గోవిందుడి కల్యాణం

- పోటెత్తిన భక్తజనం
- నేడు రథోత్సవం



గజవాహనంపై ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

కడప కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీనివాసుసుడి కల్యాణం కనులపండువగా సాగింది. అఖిలాండకోటి బ్రహ్మండ నాయకుడి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం దేవునికడప ఆలయ బాట పట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏడుకొండలవాడి పరిణయ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రాంగణం వద్ద మామిడి తోరణాలు, అరటి పిలకలతో స్వాగత ద్వారాలుగా తీర్చిదిద్దారు. వివిధ సుగంధ పరిమళ పుష్పాలతో దేవుని కడపలో కల్యాణానికి సిద్ధం చేసిన వేదిక ఇల వైకుంఠాన్ని తలపించింది. సిరులమాత శ్రీదేవి, ముద్దులొలికే భూదేవిలతో కడప రాయుని కల్యాణం ఆద్యంతం నయనమనోహరంగా జరిగింది.

ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, సాయి, త్రివిక్రమ్, కృష్ణమూర్తి, తరుణ్‌లు వేదమంత్రాలు జపిస్తుండగా.. మరోవైపు అన్నమయ్య సంకీర్తనల గానామృతం, మంగళ వాయిద్యాల నడుమ తిరుమలేసుని పరిణయం జరిగింది. సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే తిరుమల గిరులు దిగి తన ఇరువురు దేవేరులతో దేవునికడపకు విచ్చేశాడా అనే అనుభూతి కలిగింది. కల్యాణం ఆద్యంతం భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయం మార్మోగింది. కన్యాదానం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలసేవ వైభవంగా సాగాయి. కల్యాణం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు.



స్వామివారి కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

### గజవాహనంపై బ్రహ్మండ నాయకుడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు. తదుపరి తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారు. రాత్రి 8 గంటలకు ఇరువురు దేవేరులతో కలిసి వెంకటేశ్వరుడు గజ వాహనంపై కొలువుదీరి దేవునికడప మాడ వీధులలో పర్యటించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది నటేష్ బాబు, హనుమంతయ్య, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. కాగా.. దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగనుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు దేవునికడపకు పోటెత్తనున్నారు. అందుకు తగ్గట్లుగా పోలీసులు తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.





స్వామి, అమ్మవార్లకు కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో డీఆర్వో, జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులో నాణ్యమైన పరిష్కారాలు చూపాలన్నారు. తొలుత జడ్పీ సీఈవో ఓబులమ్మ పీజీఆర్‌ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో స్వయంగా సమీక్షించారు. ఈ సందర్భంగా బద్వేలు మండలం చెన్నంపల్లి ప్రగతినగర్‌కు చందిన వెంకటయ్య తాను పేదవాడిని తన కుమారుడి చదువుకు సంబంధించి ఫీజు రీయింబర్స్ మెంట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమలాపురానికి చెందిన రాధామణి ఫిర్యాదు చేస్తూ రోడ్డు విస్తరణలో భాగంగా తన ఇల్లు పూర్తిగా డ్యామేజ్ అయిందని నష్ట పరిహారం ఇవ్వాలని అభ్యర్థించారు. కడప నగరం సరోజినినగర్‌కు చెందిన దేవదానం ఇంటిస్థలం మంజూరు చేయాలనీ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, నాగేశ్వరరావు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## న్యాక్ 'ఏ'ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా అడుగులు

- దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ, సర్టిఫికెట్ కోర్సులు
- వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా విశ్వవిద్యాలయం పయనిస్తోందని అందులో భాగంగా దూరవిద్యను పటిష్ఠం చేస్తున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. వైవీయూలోని సెనెట్ హాల్లో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) కార్యక్రమానికి వీసీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... వైవీయూలో దూరవిద్య ద్వారా 8 కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఎంబీఏ (జనరల్), ఎంబీఏ (హెచ్‌ఆర్‌ఎం) కోర్సులు తీసుకురానున్నామని ప్రకటించారు. వైవీయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రాగానే డిగ్రీ కోర్సులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. వైవీయూ ద్వారా ఫిజికల్ మోడ్‌లో, ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ విధానంలో దూర విద్య అందిస్తున్నామని ఇది అందరికి సౌలభ్యంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ చదువుల పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంగా వైవీయూ దూరవిద్యను డోర్‌స్టెప్‌నకు తీసుకెళుతోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, దూర విద్య ఉప సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీధర్ బాబు, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య కె.గంగయ్య, ఆచార్యులు ఎంఎం వినోదిని, ఎన్.ఈశ్వర్‌రెడ్డి, బాయినేని శ్రీనివాసులు, గంజి పార్వతి, టి.రామప్రసాద్‌రెడ్డి, విజయభారతి, అనిత, జి.పార్వతి, మెర్సీ విజేత, అసోసియేట్ ప్రొఫెసర్లు, పలు కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ హాజరై విలువైన సూచనలు చేశారు.

## కడప రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు

- అమృత్ భారత్ కింద నిధులు మంజూరు
- బడ్జెట్‌లో కేటాయింపు



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద కడప రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు కల్పిస్తున్నారు. 2024లో దాదాపు రూ.30కోట్లతో అమృత్ భారత్ పథకం కింద పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రైల్వే బడ్జెట్‌లో కడప రైల్వేస్టేషన్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తూ కేంద్రం ఆమోదించింది. కడప రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం విస్తరణతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, ప్లాట్‌ఫారం-2లో లిఫ్ట్, విశ్రాంతి గదులు, రిజర్వేషన్ కౌంటర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పాతవి తొలగించి కొత్తవి నిర్మాణం చేస్తున్నారు.

సోమవారం కేంద్రం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో మన రాష్ట్రానికి సంబంధించి 73 అమృత్ భారత్ స్టేషన్లకు గాను రూ.2,051కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో కడప రైల్వేస్టేషన్‌కు దాదాపు రూ.120 నుంచి రూ.150కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉందని అధికారుల నుంచి సమాచారం. దీనితో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇప్పటికే రైల్వేస్టేషన్‌లో పనులు వేగంగా సాగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్‌లో ఆధునీకరణ పనులను ఈ డిసెంబరు 31లోగా పూర్తిచేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

## ఫిర్యాదులపై సత్వరం చర్యలు చేపట్టాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోను ద్వారా ఆదేశాలు జారీ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ పోలీసు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 19 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని డిపార్ట్‌మెంట్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య, డీఈసీ సభ్యులు, పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, తపాలా, విద్యుత్, నగరపాలక, పాఠశాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మామిడికి పొగమంచు దెబ్బ

- దోబూచులాడే మబ్బులతో కానరాని మామిడి పూత
- తగ్గనున్న మామిడి వ్యాపారం
- ఈ ఏడాది రైతన్నకు నష్టాలే



6

రాజంపేటలో తోటను కప్పేసిన పొగమంచు

మాట్లాడుతున్న విచారణ గురువు కాసు జోజిరెడ్డి



## మరియతల్లి దీవెనలతో ప్రశాంతత

- ఉరుటూరు విచారణ గురువు

కడప కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కల్మషం లేని నిండైన మనసుతో మరియతల్లి సేవలో తరించి ఆ తల్లి దీవెనలను అందుకోవడం వలన మనసుకు ప్రశాంతత చేకూరుతుందని ఉరుటూరు విచారణ గురువు కాసు జోజిరెడ్డి విశ్వాసులకు సూచించారు. మరియాపురం లూర్దుమాత తిరుణాల మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక మరియాపురం పాత చర్చి ఆవరణలో మదనపల్లి విచారణ గురువు ఫాదర్ సగిలి దేవదాస్ దివ్యబలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వాసులను ఉద్దేశించి దేవుని వ్యాఖ్యను కాసు జోజిరెడ్డి వినిపించారు. యేసు ప్రభువును పరిపూర్ణ హృదయంతో ప్రేమించాలన్నారు. శాతాను బోధనలకు లొంగకుండా మన దైవభక్తి నిరూపించుకునేలా ఆరాధించాలన్నారు. పాపులను, దీన జనులను రక్షించేందుకు జన్మించిన యేసు ప్రభువుకు జన్మనిచ్చిన మరియతల్లిని ప్రతీ ఒక్కరూ గౌరవించడం మనలోని భక్తికి నిర్వచనంగా నిలుస్తుందన్నారు. తదనంతరం మరియతల్లి స్వరూపాన్ని మరియాపురం వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో తిరుణాల కమిటీ అధ్యక్షుడు జ్యోతిరాయప్ప, వైస్ ప్రసిడెంట్ బాలశౌరి, కార్యదర్శి పెండ్లిమర్రి ప్రదీప్, సహాయ కార్యదర్శి ఆనంద్, ట్రెజరర్ కె.ప్రసాద్‌తో పాటు పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.



# ఏదీ చిత్తశుద్ధి..?

- పెండింగు ప్రాజెక్టుల పూర్తి, పరిశ్రమలతోనే జిల్లా అభివృద్ధి
- వనరులు పుష్కలం
- ప్రజాప్రతినిధులు, అధికారుల్లో కానరాని చిత్తశుద్ధి
- నేడు డీఆర్‌సీ సమావేశం
- హాజరు కానున్న ఇన్‌చార్జి మంత్రి

**రాష్ట్ర అభివృద్ధిలో మన జిల్లా కీలకం కానుంది. ఒకప్పుడు గ్రోత్ రేటులో ఎక్కడో చివర ఉన్న మనం ఇప్పుడు 10, 11 స్థానాలకు చేరువలో ఉన్నాం. ఇక్కడ పండ్లతోటలు ఎక్కువ. వాటికి మార్కెట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన జిల్లా. లేనిదల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల్లో చిత్తశుద్ధి. జగన్ హయాంలో జిల్లా అభివృద్ధికి బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వంలో అయినా అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో జనం ఓట్లు వేసి గెలిపించారు. మరి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. దీనికి మంగళవారం జరిగే డీఆర్‌సీ సమావేశం మంచి వేదిక.**

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగే డిస్ట్రిక్ట్ రివ్యూ కమిటీ మీటింగ్‌కు ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. గతంలో జరిగిన డీఆర్‌సీ మీటింగ్‌లో భూకబ్జాలు ఇతర సమస్యలపై సభ్యులు గళమెత్తారు. బద్వేలు, పులివెందుల ప్రాంతాల్లో జరిగిన కబ్జాలపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యంలో ఒక్కో బస్తాకు 2 నుంచి 3 కేజీలు తేడా వస్తోందంటూ ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజులరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. అది కూటమి ప్రభుత్వంలో జరిగిన తొలి మీటింగ్. ఇప్పుడు రెండోసారి మీటింగ్ జరగనుంది. త్వరలోనే రాష్ట్ర బడ్జెట్ రూపుదాల్చనుంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే డీఆర్సీ మీటింగ్ నిర్ణయాలు కీలకం కానున్నాయి.

### సాగునీటి ప్రాజెక్టులపై

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుగా జిల్లా రైతాంగం పరిస్థితి తయారైంది. బంగారు పండించే భూములున్నప్పటికీ సాగునీరు లేక బీళ్లుగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పక్కనే ప్రాజెక్టులున్నా చివరి ఆయకట్టుకు నీరు రాదు. బ్రహ్మంసాగర్, తెలుగుగంగ రిజర్వాయర్లలో లీకేజీల కారణంగా చివరి ఆయకట్టుకు సాగు నీరందలేదు. ఇక లీకేజీతో పాటు ఇతర పనులు పూర్తిచేయలేదు. దీంతో చెరువులు, లిఫ్ట్ ద్వారానే చాలా మటుకు సాగునీరు వస్తోంది. ఇక సర్వరాయసాగర్ పనులు అలాగే ఉన్నాయి. గండికోట, తెలుగుగంగ ముంపు నిర్వాసితులకు ఇంకా పరిహారం అందలేదు.

### భూకబ్జాలపై చర్యలేవీ..

జగన్ హయాంలో జిల్లాలో పెద్దఎత్తున భూకబ్జాలు సాగాయి. యువగళం పాదయాత్ర అప్పుడు నారాలోకేశ్, ఎన్నికల సమయంలో నారా చంద్రబాబునాయుడు భూకబ్జాలపై ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కడపలో అయితే వాగులు, వంకలు, కుంటలు ఆక్రమించారు. ఆర్.మాధవి ఎమ్మెల్యే కాకముందు కడపలో జరిగిన భూకబ్జాలపై ఆమె విరుచుకుపడ్డారు. వైసీపీకి చెందిన పలువురు నేతల లేఅవుట్లలో అక్రమాలపై నిప్పులు చెరిగారు. ఇక.. బద్వేలులో 2వేల ఎకరాలు కబ్జాకు గురైనట్లు నారా లోకేశ్ చెప్పుకొచ్చారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు భూదందాపై లోకేశ్ విరుచుకుపడ్డారు. కమలాపురం నియోజకవర్గంలో జరిగిన కబ్జాలపై విచారణ జరిపిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి 8 నెలలు దాటినా కబ్జాలపై కదలిక లేదు. ఎన్నికలప్పుడు కబ్జాలపై ఉక్కుపాదం అని చెప్పి.. ఇప్పుడు పట్టించుకోక పోవడంతో ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధిపై ప్రజలకు సందేహం మొదలైంది.

### కడపలో గాడితప్పిన పాలన

కడప కార్పొరేషన్ జిల్లా హెడ్‌క్వార్టర్. అలాంటి కార్పొరేషన్‌లో పాలన గాడి తప్పింది. ముఖ్యంగా పారిశుధ్యం. గతంలో కమిషనర్‌గా సాయి ప్రవీణ్‌చంద్ పనిచేసినప్పుడు పారిశుధ్యంపై ఎక్కడా రాజీ పడేవారు కాదు. వేకువజాము నుంచే రోడ్లంతా తిరిగేవారు. దీంతో సిబ్బందిలో భయం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పర్యవేక్షణ కొరవడ్డంతో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారవుతోంది. కార్పొరేషన్‌లో కూడా పాలన గాడి తప్పింది. ఇక్కడ ప్రతి పనికీ లంచాలు గుంజుతున్నారనే విమర్శ ఉంది. మంగళవారం జరిగే డీఆర్‌సీ మీటింగ్‌లో జిల్లా సమగ్రాభివృద్ధికి చేయాల్సిన ప్రణాళికలతో పాటు భూకబ్జాలపై చర్యలు, ఇతర అసాంఘికశక్తుల అణచివేతకు, పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# మామిడికి పొగమంచు దెబ్బ

- దోబూచులాడే మబ్బులతో కానరాని మామిడి పూత
- దిగుబడి తగ్గుతుందని రైతుల దిగాలు
- ఈ ఏడాది రైతన్నకు నష్టాలే
- తగ్గనున్న మామిడి వ్యాపారం

రాజంపేట/పెనగలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా ప్రకృతి మామిడి రైతుపై కన్నెర్ర చేస్తోంది. ఈ ఏడాది కూడా మామిడి దిగుబడి భారీగా తగ్గనుంది. రైల్వేకోడూరు మార్కెట్ యార్డు ఆధారంగా కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో ప్రతియేటా మామిడి పంటతో జరిగే 200 కోట్ల వ్యాపారానికి గండి పడనుంది. డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబరులో ఒక మోస్తరు పూత వస్తే జనవరి నాటికి పూర్తి స్థాయికి వచ్చి ఫిబ్రవరి నుంచి మార్చి నాటికి పిందెలు ఏర్పడి ఏప్రిల్ నుంచి మామిడికాయలు మార్కెట్‌లోకి వస్తాయి. అటువంటిది ఈ ఏడాది డిసెంబరులో ప్రకృతి పూర్తిగా మామిడి రైతుపై కన్నెర్ర చేసింది. డిసెంబరు నుంచి ప్రతిరోజూ మబ్బులు రావడం, అందునా ప్రతిరోజు పొగమంచు రావడం, అప్పుడప్పుడూ చిరుజల్లులు పడ్డాయి. జనవరిలో వచ్చే పెద్ద పండుగ మూడు రోజులు కూడా ఆ తర్వాత రోజులు ఒక మోస్తరు వర్షం కురిసింది. జనవరి నెలలో వర్షం కురవడం అన్నది ఎప్పుడూ జరగదు. వాతావరణంలో జరుగుతున్న పెనుమార్పుల వల్ల మామిడి పూత దశ వచ్చే డిసెంబరు, జనవరి నెలల్లో విపరీతంగా మంచు కురవడం, దట్టంగా పొగమంచు రావడం, చిరుజల్లులు కురవడం శాపంగా మారింది. దీనివల్ల ప్రధానంగా రైల్వేకోడూరు మండలంలోని 20 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట 30 శాతం కూడా పూత పూయలేదు. ఇక చిట్వేలి, పెనగలూరు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో మామిడి పంటకు పూత రాలేదు. వచ్చినా 30 శాతం మించలేదు. ఇక వీరబల్లె, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో అత్యంత ఎక్కువ వ్యాపారం జరిగేది ఈ ప్రాంతంలో మామిడి ద్వారానే. సుమారు 30 వేల ఎకరాల్లో ఈ ప్రాంతంలో మామిడి పంట ఉంది. బేనీషా, మలుగుబ, రుమాని, తోతాపూరి, అంటిమామిడి, పునాస, నీలం ఇలా 30 రకాల పైబడి మామిడి పంట పండుతోంది.

దేశంలోని చెన్నై, ముంబాయి, బెంగుళూరు, ఇతర ప్రధాన నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి అవుతూ ఉంటాయి. ప్రతిరోజు 10 లారీల నుంచి 30 లారీల వరకు ఎగుమతి అవుతాయి. అటువంటి పంటకు ప్రకృతి సహకరించకపోవడంతో భారీ ఎత్తున దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పెద్దఎత్తున మందులు పిచికారీ, సాగు ఖర్చులు పెట్టుకుని దిగుబడి వస్తుందన్న మామిడి రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగిల్చింది. గత ఏడాది మామిడి పంట 30 శాతం కూడా దిగుబడి రాలేదు. దానికి కారణంగా ప్రకృతి కనికరించకపోవడమే. 2023లో భారీఎత్తున ఎవరూ ఊహించని రీతిలో పంట దిగుబడి వచ్చినా అంతర్జాతీయ మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. పంట బాగా పండితే గిట్టుబాటు ధర లేకపోవడం, గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడు పంటలు పండకపోవడం వంటి కారాణాల వల్ల ప్రతియేడాది మామిడి రైతులు భారీ ఎత్తున నష్టపోతున్నారు. చేసేది లేక కొందరు మామిడి రైతులు మామిడి పంటను తీసివేసి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడింది.

ఇందులో భాగంగా అక్కడక్కడ మామడి తోటలను తీసివేయడం చేశారు. ఎండలు బాగా కాస్తేనే పూత బాగా వస్తుంది. మామిడి పూత రావడానికి రెండే ప్రధాన ఆధారం. అటువంటిది డిసెంబరు, జనవరి నెలలో మబ్బులు, చిరుజల్లులు, ప్రధానంగా పొగమంచు పూత రాకుండా చేస్తోంది. మామూలుగా ఒక ఎకరా మామిడి తోట బాగా పండితే పెట్టుబడి పోను కనీసం లక్షన్నర రూపాయలు ఆదాయం వస్తుంది. అటువంటిది పెట్టిన పెట్టుబడులు కూడా ఈసారి కూడా వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



పెనగలూరు మండలంలోని తూర్పుపల్లె అటవీ ప్రాంత మామిడి తోటను కప్పేసిన పొగమంచు



రాజంపేట ప్రాంతంలో అరకొరగా వచ్చిన మామిడి పూత



పూతరాకుండా అలంకార ప్రాయంగా ఉన్న మామిడిచెట్లు

### వెంటనే అప్రమత్తమైతే పూత పెరగొచ్చు



రైతులు తమ మామిడి తోటల్లో పూత రాకపోతే వెను వెంటనే కొన్ని మెళకువలు పాటిస్తే పూత పెరుగుతుంది. ప్రధానంగా పూత రాని తోటల్లో పూమొగ్గలు ఉత్తేజపరిచి పూత రావడానికి ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్, ఫార్ములా-4 లేదా ఆర్గాన్ మ్యాంగో స్పెషల్ లీటరు నీటికి తగు మోతాదులో పిచికారీ చేయాలి. పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, పక్షికన్ను తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మోనోక్రోటోపాస్, కార్బానిజం, వేపనూనె తగు మోతాదులో కాండం, కొమ్మలు బాగా తడిచేలా పిచికారి చేస్తే బాగా పూత వస్తుంది.

- సురేష్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి, రాజంపేట.

### 40 ఎకరాల్లో నాలుగెకరాల్లో కూడా పూత రాలేదు



40 ఎకరాల్లో మామిడి పంట మాకు ఉంటే అందులో నాలుగెకరాల చెట్లకు కూడా పూత రాలేదు. ఎకరాకు వంద చెట్లు ఉంటే కనీసం 5 చెట్లకు కూడా పూత రాలేదు. వచ్చినా ఒకటిరెండు చోట్ల వచ్చి అది కూడా పూత రాలిపోతోంది. ఎకరాకు 20 వేలు ఖర్చు చేసి 40 ఎకరాలు సాగు చేస్తే సుమారు 10 లక్షలు ఖర్చయింది. ఫిబ్రవరి నాటికి పూత 30 శాతం కూడా రాకపోవడంతో మామిడిపై పెట్టుకున్న ఆశలు నిరాశలవుతున్నాయి. గత ఏడాది 5 లక్షలు కూడా రాలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత ఖర్చు చేసినా పూత రాకపోవడంతో మా ఆశలు ఈ ఏడాది కూడా నెరవేరేటట్లు లేదు.

-తుమ్మలకుంట ఈశ్వర్‌కుమార్, మామిడి రైతు, నాగిరెడ్డిపల్లె గ్రామం

### పూత మాగిపోయింది



మా భూములు పండ్ల తోటలు చెయ్యేటి పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. మా ప్రాంతమంతా ఎప్పుడూ చలి ప్రాంతంగా ఉంటుంది. అందువల్ల సీజన్ మారిపోయినా కొన్ని రకాల మామిడి చెట్లలో సకాలంలోనే పూత వచ్చింది. పుష్కలంగా పూత వస్తుందని ఆశపడ్డ రోజులు జరుగుతుండగా పూత మగ్గిపోతోంది. శాస్త్రవేత్తలను ఆశ్రయించాల్సి వచ్చింది.

- డి.శివకుమార్‌రెడ్డి, నర్సింగరాజపురం, పెనగలూరు

### తలకు మించిన భారంగా ఖర్చులు



నాకు ఉన్న మామిడితోటకు ఖర్చులు యేటా తలకుమించిన భారంగా మారాయి. రెండేళ్లలో మామిడి తోటల్లో సేద్యపు ఖర్చులు, మందుల పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి తప్పితే దిగుబడి మాత్రం రాలేదు. ఈ ఏడాది అయినా 10 రూపాయలు కళ్ల చూద్దామనుకుంటే తికమక వాతావరణంతో ఇంకా పూత రాలేదు. అయినా సరే వ్యవసాయంపై ఉన్న మక్కువ వదలను.

- బద్దల వెంకటయ్య, రైతు, సాతపల్లె, పెనగలూరు

# వంకను పూడ్చేశారు...

- వంకలో మట్టి తోలి తన భూమిలో కలుపుకున్న ఘనుడు

సిద్దవటం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి ఆనుకుని ఉన్న వంకను సైతం ఓ రైతు ఆక్రమించుకుని తన భూమిలో కలిపేసుకున్నాడు. వర్షాకాలంలో ఈ వంక నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. అటువంటి వంకను దాదాపు సగం పూడ్చివేసి కాలువలాగా మార్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా వంక స్థలాన్ని కబ్జా చేశాడు. కడప-పోరుమామిళ్ల రహదారి సిద్దవటం గ్రామం రెవెన్యూ పొలం సర్వే నెంబరు 378, 54/1, 54/2లో సుమారు ఐదెకరాలు పట్టా కలిగిన కడప నగరానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకున్న ఉన్న వంకను పూడ్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా తన స్థలంలో కలుపుకున్నాడు. ఆ స్థలంలో చదును చేసి ప్లాట్లు వేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కూడా ఆ భూమికి హద్దులు ఏర్పాటు చేసిన రాళ్లను నాటినా వాటిని దాటుకుని వంక స్థలాన్ని కూడా ఆ రైతు చదును చేసి తన పొలంలో కలుపుకున్నాడు. డిసెంబరు నుంచి ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. ఎగువ ప్రాంతమైన అవసరకోన, కోతి రాయికొండ, దుర్గమ్మకోన ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వచ్చే నీటితో ఈ వంక ఉధ్రుతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. ఇటువంటి వంకను పూడ్చివేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. వంక కబ్జా విషయమై ఇరిగేషన్‌శాఖ ఏఈ సాయిక్రిష్ణను వివరణ కోరగా ఈ విషయం మా దృష్టికి రాలేదని, వంక అన్యాక్రాంతం అయి ఉంటే స్థానిక తహశీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేసి అన్యాక్రాంతం అయిన వంక స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



వంకను కబ్జా చేసి తోలిన మట్టి

## హంద్రీ-నీవా ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలి

- చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తిచేయాలి
- సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాష్ట్ర నాయకుల ధర్నా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):రాయలసీమలోని అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు, పట్టణాలకు తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు నీటిపారుదల సామర్థ్యం పెంచాలని సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఈశ్వరయ్య, రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణానది జలాలు తీసుకురావడానికి 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకు సంపూర్తి కాలేదన్నారు. 6లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టులో అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఆయకట్టు భూములకు సరిపడా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ తవ్వలేదన్నారు. మొత్తం భూములకు సాగునీరు అందించాలంటే 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ హంద్రీ-నీవాకు సమాంతరంగా కాలువ తవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయకుండా మూలన పడేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన శ్రీచందు, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, మనోహర్‌రెడ్డి, సుధీర్, వెంకటేశ్ రంగారెడ్డి, హరి, సురేష్‌కుమార్, తిరుమల, సలీమ్ తదితరులుపాల్గొన్నారు.



సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ మహాధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

## 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జా తీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కలె క్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు పంపిణీ చేస్తారని, దీని ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు మాత్రలను అందేవిధంగా చేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ సహకార సంవత్సర గోడపత్రిక ఆవిష్కరణ

ఐక్యరాజ్యసమితి-2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని, సహకార సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి అని ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరానికి ప్రకటించిందన్నారు. జిల్లాలో సహకార కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన విధంగా జరపాలని జిల్లా సహకార అధికారిని, ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎస్‌డీసీలతో పాటు జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

- విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లాశాఖ వినతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాల పేరుతో చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనాన్ని ఆపాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాయచోటిలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి తప్పులను సరిచేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారన్నారు. అయితే గత ప్రభుత్వం తరగతులను విలీనం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలనే విలీనం చేస్తోందని ఆరోపించారు. ఒక పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను అన్నింటినీ విలీనం చేసి, ప్రాథమికోన్నత పాఠశాలల మనుగడే లేకుండా చేస్తోందన్నారు. ఫలితంగా భవిష్యత్తులో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 పైగా ఉన్నా, తగినన్ని తరగతి గదులు మౌలిక వసతులు లేకపోతే వాటిని ఐదు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపివేస్తామనడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. మౌలిక వసతులు, మూడు కిలోమీటర్ల దూరంలో సంబంధం లేకుండా 60 మంది విద్యార్థులు పైబడి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటినీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వారు డిమాం డ్ చేశారు. 60 పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగా తీర్చిదిద్దడమే కాకుండా, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులను కూడా నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకట్రమణ, వెంకటసుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, అక్రంబాషా, ఆదినారాయణ, దావుద్దీన్, ప్రచురణల విభాగం జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

### అనుమానాస్పద స్థితిలో
## మహిళ మృతి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన పీవీ శేఖర్‌రెడ్డి భార్య కవిత(33) అంగళ్లలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. శేఖర్‌రెడ్డితో మేనరికం కారణంగా వివాహమైంది. వారికి పదహారేళ్ల కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలంగా భార్యభర్తల మధ్య ఫోన్ మెసేజ్‌ల కారణంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో శవమై తేలింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కవిత చిన్నాన్న శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిమెంట్ లారీ బోల్తా - డ్రైవర్ మృతి



రోడ్డుపై పక్కకు ఒరిగి పడిపోయిన సిమెంట్ లారీ, (ఇన్‌సెట్లో) డ్రైవర్ రాజు

కాశినాయన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ హనుమంతు వివరాల మేరకు.. ఒంగోలు జిల్లాలోని కంభం మార్కాపురంలో సిమెంట్ లోడు లారీ ప్రొద్దుటూరుకు వెళ్తూ పోరుమామిళ్ల- మైదుకూరు ప్రధాన రహదారిపై సోమవారం ప్రమాదానికి గురైందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు (50) అక్కడికక్కడే మృతిచెందగా, క్లీనర్ ప్రాణాలతో బయట పడ్డాడని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు ఎత్తు తగ్గులు ఉండడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన కూతవేటు దూరంలోనే ఓ పెద్ద ట్రాన్స్‌ఫారం ఉంది. ఒకవేళ దాన్ని ఢీకొన్నట్లయితే పెనుప్రమాదం జరిగి ఉండేది.

## మృతుడి వివరాలు గుర్తింపు

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పంప్‌హౌస్ సమీపంలో ఆదివారం రైలుకింద పడి మృతిచెందిన వ్యక్తి వివరాలను సోమవారం ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు పులివెందులకు చెందిన మల్లేపల్లి రంగనాథ్‌గా గుర్తించారు. ఇతను గత కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల స్వస్థలం చౌటిపల్లె కావడంతో ఇక్కడికి వచ్చి అనారోగ్య సమస్యలతో రైలుకింద పడి మృతిచెంది ఉండవచ్చని పోలీ సులు భావిస్తున్నారు. కాగా ఇతనికి భార్యతో పాటు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు రైల్వే ఎస్సై సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# అతివలు... అక్షర వెలుగులు

- మహిళల వికాసానికి ఉల్లాస్
- ప్రారంభమైన బోధనా తరగతులు
- అక్షరజ్ఞానం, దైనందిన విషయాలపై అవగాహన




నరసింహాపురంలో మహిళల విద్యాభ్యాసం

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు. మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నేటికి చాలా మంది అతివలు నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసేందుకు 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరందరికీ అక్షరజ్ఞానం కలిగించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రధాన లక్ష్యం. 15 ఏళ్ల వయస్సు పైబడి ప్రాథమిక విద్యకు నోచుకోని వారు మధ్యలోనే బడి మానేసి అక్షరాలను మరచిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ, రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.

### విద్యావంతులకు శిక్షణ

ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలు యువతులను గుర్తించి వారికి ఇప్పటికే మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీరు అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు, తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన




నిరక్షరాస్యులకు బోధించే పుస్తకం

### నిరక్షరాస్యుల ఎంపిక

ఉమ్మడి కడపజిల్లాలో 65 మండలాల్లోని 36,937 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు 3,693 కేంద్రాలకు వలంటీర్లను నియమించారు. వలంటీర్లలో పొదుపు సంఘాలకు వీఓఏలు కూడా విద్యాబోధన చేసేందుకు తగిన తర్ఫీదునిచ్చారు. వీరు ప్రతిరోజు సుమారు రెండు గంటలపాటు నిరక్షరాస్యులకు బోధనా తరగతులు నిర్వహిస్తారు. బోధనకు జిల్లా వ్యాప్తంగా మార్గదర్శక వాచకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అభ్యాసపు హాజరు పట్టీలు అందించారు. వీటినన్నింటినీ మండల కేంద్రాల నుంచి అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని వయోజన విద్యాకేంద్రాలకు సరఫరా చేశారు. స్వయం సంఘాల్లో వీఓఏలను వలంటీర్లుగా ఎంపిక చేసి వారి ద్వారా గ్రామాల్లో బోధన అందిస్తున్నారు. జనవరి 27 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు మార్చి నెల 18 నాటికి శిక్షణ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. ఈ ప్రత్యేక శిక్షణ తరగతుల ప్రక్రియపై వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

### అక్షర వెలుగులు నింపుతాం

**- వెంకటసుబ్బమ్మ, వెలుగు ఏపీఎం, ప్రొద్దుటూరు మండలం**

మహిళలు డిజిటల్ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగుభాష, గణితంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందిస్తాం. ప్రొద్దుటూరు మండలంలో 1700 మంది నిరక్షరాస్యులను గుర్తించాం. వీరికి 170 మంది వలంటీర్లతో రోజుకు గంటన్నరపాటు బోధన జరిగేలా పర్యవేక్షణ ఉంటుంది. శిక్షణ కాల పరిమితి పూర్తయ్యే నాటికి అతివల్లో అక్షర వెలుగులను నింపుతాం.

# దస్తగిరిరెడ్డిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- పులివెందుల డీఎస్పీ మురళి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

పులివెందులటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం ఇనగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డిపై గత నెల 29న జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులకు గానూ ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. సోమవారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 29న ఇనుగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబురెడ్డి సొంత పనినిమిత్తం పులివెందులకు వచ్చారు. తన పని పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మొరంరెడ్డి సమరసింహారెడ్డి, మొరంరెడ్డి హరికిశోర్‌రెడ్డి అలియా కిశోర్‌కుమార్‌రెడ్డి, మోరంరెడ్డి బాల ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కాపు కాచి దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నేతృత్వంలో పులివెందుల రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్, తొండూరు ఎస్‌ఐ చిన్న ఓబన్న వారి సిబ్బంది కలిసి సైదాపురం క్రాస్ రోడ్డు, పులివెందుల ముద్దనూరు మెయిన్ రోడ్డు తొండూరు మండలం వంతెనపై ఉన్న ముగ్గురు నిందితులను గుర్తించి సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా బాధితుడు, నిందితులందరూ ఇనగనూరు గ్రామానికి చెందిన వారేనని, వ్యవసాయ పొలంలో వేసిన 350 చీనీ చెట్లకు కరువు పని బిల్లులు చేయించుకునే విషయమై మనస్పర్థలు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో దస్తగిరిరెడ్డిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని, ముందుగా అనుకున్న ప్రకారం గత నెల 29న ఉదయాన్నే తన పని మీద మోటారు సైకిలుపై పులివెందులకు వెళ్తుండడంతో పులివెందుల జేఎన్టీయూ కళాశాల వద్ద నిందితులు ఇనుప రాడ్లతో దాడి చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు భాస్కర్‌రెడ్డి ప్రస్తుతానికి పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే పులివెందుల సబ్‌డివిజను పరిధిలో 18 గ్రామాలను ఫ్యాక్షన్ గ్రామాలుగా గుర్తించామన్నారు. మానవ ప్రాణానికి ఎటువంటి హాని కలిగించినా ఉపేక్షించేది లేదని, అలాగే సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం, తొండూరు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై దాడి

- నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధి శివార్లలో బైపాస్ రోడ్డు పక్కన వ్యభిచార గృహంపై ఆదివారం రాత్రి దాడి చేసి నలుగురిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు బైపాస్ రోడ్డు పక్కన బంకులో తమ సిబ్బంది అక్కడ నిఘా ఉంచారని, అదే సమయంలో అక్కడ ఇద్దరు మహిళలతో పాటు నాగన్న, అబ్దుల్లా అనే వారు ఉన్నట్లు గుర్తించారన్నారు. వారిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా హెచ్చరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇలాంటి పరిస్థితి జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా ఉన్నట్లయితే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.



## స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలి

- పశువైద్య కళాశాల విద్యార్థుల ఆందోళన



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వెంటనే స్టైఫండ్‌ను పెంచి న్యాయం చేయాలంటూ పశువైద్య కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న వెటర్నరీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట విద్యార్థి నాయకుడు శివతరుణ్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు తమకు స్టైఫండ్ కింద కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. నిత్యావసర ధరలు పెరిగినా స్టైఫండ్ మాత్రం పెరగలేదని వాపోయారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తాము కూడా ఐదున్నర సంవత్సరాలు చదువుతున్నామని పేర్కొన్నారు. మెడికల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో రూ.26 వేలు ఇస్తున్నారని, వెటర్నరీ ఇంటర్న్‌షిప్ కూడా వారితో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సిలిండర్ పేలి మహిళకు గాయాలు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పైడిపాళెం గ్రామంలో వెంకటలక్ష్మి అనే మహిళ ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు.. వెంకటలక్ష్మి తన సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి వంట చేసేందుకు గ్యాస్ పొయ్యిని వెలిగించబోయింది. కాగా గ్యాస్ లీక్ అయిన విషయాన్ని గమనించని వెంకటలక్ష్మి స్టౌవ్ వెలిగించేందుకు లైటర్ ఆన్ చేయగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. ప్రమాదంలో బాధితురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పుతో పాటు గోడల మధ్యన చీలికలు రావడంతో పాటు ఇంట్లోని ఫ్రిజ్, టీవీ తదితర సామగ్రి కూడా పాడైపోయాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సిలిండర్ పేలి ఇంట్లో చిందర వందరగా పడిన సామగ్రి, (ఇన్‌సెట్లో) నెర్రెలు చీలిన గోడలు

## హాకీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవిచంద్ర

- రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బి.లక్ష్మీదేవి



జె.రవిచంద్ర, బి.లక్ష్మీదేవి

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన జె.రవిచంద్ర, బి.లక్ష్మీదేవిలు హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎంపిక కావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారిద్దరూ భార్యభర్తలు కాగా మొదటిసారి రాష్ట్ర కార్యవర్గం సభ్యులుగా ఎంపిక కావడంపై జిల్లా హాకీ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జె.రవింద్ర రాష్ట్ర హాకీ క్రీడాకారునిగా జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచారు. హాకీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జిల్లా అధ్యక్షునిగా జిల్లాల్లో హాకీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన ప్రతిభ ఆధారంగా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై స్పోర్ట్స్ కోటాలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూనే హాకీ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. బి.లక్ష్మీదేవి ఖోఖోలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రస్తుతం వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్‌గా అనేకమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. హాకీ అసోసియేషన్ వారు చేసిన సేవలను గుర్తించి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గానికి వారు ఎన్నిక కావడానికి కృషి చేసిన అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, రాష్ట్ర కార్యదర్శి హర్ష, ఇతర కార్యవర్గ సభ్యులకు హాకీ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శేఖర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

## 138 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు



ఆంధ్రా - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్రా -హిమాచల్‌ప్రదేశ్‌ల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీల్లో సోమవారం ఆంధ్ర జట్టు 138 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.. టాస్ నెగ్గి బ్యాటింగ్ దిగిన ఆంధ్రా జట్టు తొలుత 135.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 544 పరుగులు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 124.3 ఓవర్లలో 436 పరుగులు చేసింది. దీంతో ఆంధ్రా జట్టుకు 108 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించినట్లయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో దిగిన ఆంధ్రజట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది. ఇందులో కె.రేవంత్‌రెడ్డి 19 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రాజట్టు 138 పరుగుల ఆధిక్యతతో ఉంది. కాగా ఆటకు మంగళవారం చివరి రోజు.

## వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కానపల్లెకు చెందిన తాటి గంగయ్య (54) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గంగయ్యది ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామం. 35 ఏళ్ల క్రితం కానపల్లెలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసముంటున్నాడు. కానపల్లెలో ఇతనికి 5 సెంట్ల స్థలం వుంది. ఇటీవలే ఆ స్థలం అమ్మేశాడు. తన స్వంత ఊరు తిమ్మాపురం వెళ్లాలని తలచాడు. కానీ ఈ స్థలం అమ్మడంపై భార్య భర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం కూడా తన భార్యతో గొడవ జరగడంతో సోమవారం ఉదయం భార్య బంధువుల ఇంటికి వెళ్లడం ద్వారా ఇంట్లో ఒంటరిగా వున్న గంగయ్య రేకుల ఇంట్లో పైపులకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు గంగరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్లు లేక సదరం రీ-చెకప్ క్యాంప్‌లో అవస్థలు



ప్రభుత్వ ఆసుపత్రిలో రీ-చెకప్ కోసం గుంపుగా జనం

పులివెందుల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన సదరం రీ-చెకప్ క్యాంప్ డాక్టర్లు లేక వెలవెలబోయింది. అనర్హులు దివ్యాంగులుగా నకిలీ సర్టిఫికెట్లతో పించన్లు పొందుతున్నారని, ప్రభుత్వం వాటిని ఏరివేసే పనిలో భాగంగా రీవెరిఫికేషన్ క్యాంపును సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ క్యాంప్‌నకు ఇరువురు డాక్టర్లు రావాల్సి ఉంది. కేవలం ఒక డాక్టర్ మాత్రమే హాజరయ్యారు. కానీ దివ్యాంగులు దాదాపు 120 నుంచి 150 మంది దాకా వచ్చారు. డాక్టర్ లేకపోవడంతో దివ్యాంగులు గంటలతరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 9.30గంటల నుంచి రాత్రి 7గంటల వరకు దివ్యాంగులు రీ-చెకప్ కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. దివ్యాంగులతో ఆసుపత్రి అంతా నిండిపోయింది. కానీ అక్కడ డాక్టర్ ఒకరే కావడంతో అక్కడికి వచ్చిన వారు మండిపడ్డారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి డీసీహెచ్ఎస్ హిమదేవిని వివరణ కోరగా కొన్ని ఇబ్బందుల వల్ల ఇరువురు డాక్టర్లు రావాల్సి ఉన్నా ఒకరే వచ్చార న్నారు. దీంతో దివ్యాంగులు ఇబ్బందిపడినట్లు తెలిసిందన్నారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమం ఉందని, ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

## పదేళ్లు ముఖ్యమంత్రులుగా పనిచేసినా..
## పులివెందులలో ఇంకా నీటి సమస్య..!



బక్కన్నగారిపల్లె చెరువులో కృష్ణాజలాలకు హారతి ఇస్తున్న పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రులుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేసినా.. పాడా ద్వారా ఆరు వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసినా.. పులివెందుల నియోజకవర్గంలో వేసవి రాకముందే తాగునీటి సమస్య ఉండడం బాధాకరమైన విషయమని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన బక్కన్నగారిపల్లె చెరువుకు కృష్ణాజలాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి గంగా హారతి ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సొంత నియోజకవర్గ ప్రజల అవసరాల గురించి పట్టించుకోకపోవడం ముఖ్యమంత్రులుగా వారి పరిపాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వేలకోట్లు ఖర్చుచేసినా నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం తన బాధ్యతగా ప్రజల తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, సీబీఆర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి సన్నిధిలో వసంత పంచమి వేడుకలు



వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంతపంచమి సందర్భంగా నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. అందులో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం చేశారు. త్రిమూర్తి స్వరూపిణి అయిన విజయదుర్గమ్మ సన్నిధిలో చేపట్టిన అక్షరాభ్యాస కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ పిల్లలచే పూజలు చేయించారు. పాల్గొన్న వారందరికీ ఆలయ వ్యవస్థాపకుడు మల్లిఖార్జునరావు, ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నం వడ్డిస్తున్న సుభాన్ బాషా

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపమని కడప సీఎస్ఐ స్కూలు 1978 బ్యాచ్ విద్యార్థి సుభాన్‌బాషా అన్నారు. రెండు సంవత్సరాల నుంచి కడప సీఎస్ఐ స్కూలు 1978 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అన్నదానం చేస్తున్న సంగతి తెలసిందేనన్నారు.అందులో భాగంగా సోమవారం కూడా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. అబ్దుల్‌కరీం, రఫిక్, విజయ్‌కుమార్, సుకుమార్, జోహర్, ఉస్మాన్‌ఖాన్, గౌస్ పాల్గొన్నారు.

### 'రాష్ట్రపతిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రథమ పౌరురాలు, భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఉద్దేశించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియాగాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షురాలు పద్మావతిభాయ్ అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.



## క్యాలెండరు ఆవిష్కరణ

కడప క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కడప శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండరును ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏవో జ్యోతి, ఏపీ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ అగస్టీన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరి, సెక్రటరీ ఆనందకుమార్, జాయింటు సెక్రటరీ నాగమణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

### జిల్లా మహాసభను
## జయప్రదం చేయండి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని కృష్ణా సర్కిల్ వద్ద ఉన్న షాహి దర్బార్ మీటింగ్ హాల్‌లో ఈనెల 5వ తేదీన ఆప్ కి ఆవాజ్ జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా కోరారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు అన్ని రంగాలలో వెనుకబడిన ఉన్నారని, ముస్లిం మైనార్టీల హక్కుల కోసం పోరాటం చేయడం ఎంతో అవసరమన్నారు.

### ఎస్పీకి శుభాకాంక్షలు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, కడప పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, నాయకులు సోమవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఎస్పీని కలిసిన వారిలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు బండి జకరయ్య, ధ్రువకుమార్ రెడ్డి, ఇర్ఫాన్ బాషా, అశోక్‌కుమార్ రెడ్డి, అబ్దుల్ సత్తార్, గౌస్‌పీర్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

### విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

వేంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి, వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను పేర్కొన్నారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో విజ్ఞానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓలు సాదిక్, స్టాలిన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

వల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరులో వేదమాత గాయత్రి చారిటబుల్ ట్రస్టు వారిచే నూతన గాయత్రి దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తుల ఆనందాల మధ్య మేళతాళాల మధ్య ప్రతిష్ఠాపన చేసిన అనంతరం భక్తులు అమ్మవారికి కాయ కర్పూరం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. వేదమాత గాయత్రి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

### ఆరుగురు జూదరుల అరెస్ట్

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల గ్రామంలో సోమవారం ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3670 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఈ సందర్భంగా ఎస్ఐ తులసీనాగప్రసాద్ వివరించారు.

### వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 3: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కొడిదెల సంజీవరాయుడు (45) సోమవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరాయుడు పట్టణంలో టైలర్‌గా పని చేసేవాడు. గత కొద్దిరోజులుగా చెవినొప్పి రావడంతో సోమవారం అది తీవ్రతరం కావడంతో ఆత్మహత్యకు పాల్పడార్డరన్నారు.

### 7 లోపు దరఖాస్తు చేసుకోండి

సికెదిన్నె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాలకు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. జిల్లాలోని బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణం పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 8 నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారిని గుర్తించి బ్యాంకు అకౌంట్‌లో సబ్సిడీ జమ చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అబాకస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): అబాకస్ పరీక్షలో సింహాద్రిపురం వివేకానంద హైస్కూల్ 4వ తరగతి విద్యార్థి ఎ.జితేంద్ర రాయల్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. విశ్వం ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో నిర్వహించిన జిల్లా స్థా యి అబాకస్ పోటీలో జితేంద్ర రాయల్ అత్యంత ప్రతిభ కనపరచి లెవెల్-3 విభాగంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదర్‌వలి, డైరెక్టర్ జాఫర్, ఉపాధ్యాయ బృందం ఆ విద్యార్థిని అభినందించారు.

### 'ఆ స్కూలుకు అనుమతులు లేవు'

సికెదిన్నె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె వద్ద ఏర్పాటు చేస్తున్న ఏడీపై స్కూలుకు అనుమతులు లేవని మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. దీనిపై ఇటీవల విద్యార్థి సంఘాలు ఉప విద్యాశాఖాధికారికి,మండల విద్యాశాఖకు ఫిర్యాదు చేయడంతో దానిపై వివరణ ఇచ్చారు. తల్లిదండ్రులు గమనించాలని, అనుమతులు వచ్చేవరకు పిల్లలను చేర్పించకూడదన్నారు.

### సృజనాత్మకతను వెలికితీస్తాం

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాం అని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా అమిత్ సింగ్ అన్నారు. సోమవారం ఆ స్కూల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా విద్యతో పాటు వివిధ క్రీడా విభాగాలలో విద్యార్థులు రాణించేలా శిక్షణ అందించడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందింపజేస్తామన్నారు.

### అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో విచ్చలవిడిగా అక్రమ ముగ్గురాయి మైనింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీ జేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అధికారులను డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహజ సంపదను అక్రమంగా కొల్లగొడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

## గురుకుల్ విద్యాపీఠ్‌లో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని కడప నగరం ఎన్జీఓ కాలనీ గురుకుల్ విద్యాపీఠ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఈవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సరస్వతి జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పురోహితులు హోమం నిర్వహించి చిన్నారులను ఆశీర్వదించారన్నారు. కేవీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ మీరాకుమారి, సీఈఓ ఏఎల్ వివేకానంద, బి.పల్లవి, ప్రిన్సిపాల్ మునిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ట్రిపుల్‌ఐటీలో ఘనంగా సరస్వతి పూజ

వేంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం వసంత పంచమి పురస్కరించుకొని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సెంట్రల్ లైబ్రరీలో సరస్వతీ పూజను వేడుకగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నకుమారి తదితరులు పాల్గొని పూజలు చేశారు. విద్యార్థులనుద్దేశించి అధికారులు మాట్లాడుతూ కష్టపడి చదువుకొని చదువులతల్లి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

**సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో అక్షరాభ్యాసం**

స్థానిక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయపూజారి గిరి ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కనులపండువగా సుమంగళి పూజ

కడప కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆకుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో సోమవారం సుమంగళి పూజ కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పిడతల గోపాలక్రిష్ణశర్మ సారథ్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు అమ్మవారి సన్నిధిలో దీపాలు వెలిగించారు. మహిళలకు ఆలయం తరఫున పసుపు, కుంకుమ, గాజులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా శ్యామలాదేవి ఊరేగింపు

చెన్నూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సకల విద్యాప్రదాయని రాధేశ్యామలాదేవి ఉత్సవాన్ని చెన్నూరు బెస్తకాలనీలో కనులపండువగా నిర్వహించారు.వార్షికోత్సవంలో భాగంగా గోపవరంలో కొలువైన ఉత్సవమూర్తిని ఊరేగింపుగా చెన్నూరు బెస్తకాలనీకి తీసకువచ్చి ఊరేగించారు. సోమవారం చెన్నూరు బెస్తకాలనీలో ఆలయ కమిటీ నిర్వాహకులు బోలా సోదరులు ఉత్సవాలు నిర్వహించారు. అలాగే మాఘమాసం తొలి సోమవారం సందర్భంగా చెన్నూరు మల్లేశ్వరాలయంలో మూల విరాట్‌మూర్తి మల్లిఖార్జునుడికి విశేష పూజలు జరిగాయి.

### కామర్స్ విభాగంలో డాక్టరేట్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం కామర్స్ శాఖ స్కాలర్ కొప్పుల అంజనేయులుకు విశ్వవిద్యాలయ డాక్టరేట్ ప్రకటించింది. ఈయన వైవీయూ కామర్స్ శాఖ ఆచార్యులు జి.విజయభారతి పర్యవేక్షణలో ఆకుపేషనల్ డైవర్సిఫికేషన్ అండ్ వీవర్స్ ఎంటర్‌ప్రైజ్ సస్టైనబిలిటీ - ఎ కంపేరటివ్ స్టడీలో పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఉపకులపతి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల కమిటీ అంజనేయులు సమర్పించిన థీసిస్‌ను పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉందని నిర్ణయించారు. ఈ మేరకు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కృష్ణారావు అంజనేయులుకు డాక్టరేట్ ప్రకటించారు. అంజనేయులును విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ,కామర్స్ శాఖ అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు అభినందించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

● హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేశ్‌కుమార్ సూచించారు. సోమవారం ఏఆర్ పోలీసు పరేడ్ మైదానంలో తనిఖీ అనంతరం దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచి పేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని కోరారు. హోంగార్డులు దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని కమాండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## 'కడప నగరంలో
## క్రైస్తవ చిహ్నాలను ఏర్పాటు చేయాలి'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మూడు మతాలను సమానంగా చూడాల్సిన అధికారులు, పాలకులు రెండు మతాలకు ప్రాధాన్యత కల్పించి ఒక మతాన్ని విస్మరించడం సరికాదని, క్రైస్తవ చిహ్నాలను ఏర్పాటు చేయాలని క్రైస్తవ నమూనా సాధన కమిటీ సభ్యుడు మడగలం ప్రసాద్, జ్యోతి జార్జి, సి.హెచ్.విజయ్‌బాబు, శేఖర్, జోజప్ప కోరారు. సోమవారం కడప కార్పొరేషన్ కార్యాలయం గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు, మేయర్ చాంబర్‌లో మేయర్ సురేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందించారు. క్రైస్తవ నమూనాలను విస్మరించడం క్రైస్తవులను అవమానించడం అవుతుందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు మరొకసారి గుర్తుచేయాలనే ఉద్దేశంతో ఆర్డీఓ, కలెక్టర్, కడప ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని తెలిపారు.

### యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీఎస్ఎస్ యాప్‌తో రైతులకు ఎంతో మేలు అని, ప్రతి రైతూ ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని డీడీఏ రమణారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రమణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగభూషణం, ఎన్‌పీఎస్ఎస్, సీఎల్ఎస్ యాప్ పనితీరు గురించి తెలిపారు. మండల వ్యవసాయాధికారులు సరస్వతి, శ్యామ్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, సంతోషిణి పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి



నిరసనలో డప్పు వాయిస్తున్న పెద్దపల్లె శేఖర్

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటరు పెద్దపల్లె శేఖర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందక్రిష్ణమాదిగ ఆధ్వర్యంలో హైదరాబాదులో తలపెట్టిన 'వేల గొంతుకలు, లక్ష డప్పులు' కార్యక్రమానికి సంఘీభావంగా ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించిందన్నారు. ఈ పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల్లో మాదిగ జాతికి తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. అన్ని విభాగాల్లో తమ జాతికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. న్యాయబద్ధమైన వర్గీకరణ పట్ల పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరోసారి ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ ప్రతినిధి సువర్ణరాజు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

బద్వేలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణకు గురైన దాదాపు 70 సర్వేనెంబర్ల లోని పబ్లిక్ పర్పస్ స్థలాలను , రస్తాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు, జకరయ్య, అనిల్‌తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని మాజీ గౌరవాధ్యక్షుడు మద్రిప్రకాశం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో సాయిశ్రీకి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అందుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

## 'డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిలమకూరులోని 1వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ ప్రజా సమస్యలపై సక్రమంగా స్పందించడం లేదని చిలమకూరుకు చెందిన గ్రామస్థులు ఎంపీడీవో వెంకటరమణయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై అడిగినా ప్రజలను చీదరించుకుంటున్నాడని ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పేరుకే మేజర్ పంచాయతీ..అభివృద్ధి శూన్యం

● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

ముద్దనూరు ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు గ్రామం పేరుకే మేజర్ గ్రామ పంచాయతీ, ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక , ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అభివృద్ధికి దూరంగా ఉంది.గ్రామంలో దాదాపు 3500గృహాలు, 13వేల జనాభా ఉంది.జనాభా పెరుగుతున్నా దానికి అనుగుణంగా వసతులు కల్పించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.పులివెందులరోడ్డు లోని నాలుగు రోడ్ల కూడలి నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వరకు ప్రధాన రహదారిలో డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో నీరు పోయేందుకు వీలు లేకపోవడంతో రోడ్డు పైనే ప్రవహిస్తుంటాయి. గుంతలు ఉన్నచోట వర్షపు నీరు నిలిచి కుంటలను తలపిస్తుంటాయి.చాలా సార్లు రోడ్డు విస్తరణతో పాటు డ్రైనేజీ ఏర్పాటుకు టెండర్లు పూర్తయినా నాయకుల పుణ్యమా అని పనులు నిలిచిపోతున్నాయి.ప్రస్తుతం టెండర్లు పూర్తయి ఐదు నెలలు కావస్తున్నా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు.జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్లు పడితే అవతల ఉన్న కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి గేట్లు పడతాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.బ్రిడ్జి కింది నుంచి ద్విచక్రవాహనాలు, ఆటో, కార్లు వెళ్లే అవకాశం ఉన్నా, బ్రిడ్జి సమీపంలో గ్రామ పంచాయతీ అధికారులు పెద్ద డ్రైనేజీ కాల్వ తీశారని ఆరోపిస్తున్నారు. కాల్వలో పైపు ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాలు నడుస్తాయని ప్రజలు అంటున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎల్ఎం కాంపౌండ్,ఎస్వీగిరి కాలనీ, మార్కెట్ రోడ్డు,కొత్తకొట్టాలు, బాలుర ఉన్నత పాఠశాల రోడ్డుల్లో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు.ఇంకా చాలా వీధుల్లో డ్రైనేజీలు లేవు.జనాభా పెరుగుతున్నా గతంలో ఉన్న 8 బోర్లతోనే మంచి నీటి సరఫరా చేస్తున్నారు.అప్పుడప్పుడు మోటార్లు మరమ్మతుకు లోనవుతున్నాయి.గండికోట వద్ద నున్న నీటి పథకం పనిచేయకుంటే, గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తుతుంది.గ్రామ పంచాయతీలో కనీసం అదనపు మోటార్లు కూడాలేవు.అధికారులు తమకెందుకని కాలం గడుపుతూ వస్తున్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరువైపులా డ్రైనేజీలు లేని పులివెందుల రోడ్డు



రైల్వే బ్రిడ్జి సమీపంలో రోడ్డుకు అడ్డంగా గ్రామ పంచాయతీ అధికారులు తీసిన డ్రైనేజీ కాలువ

## అందరి సహకారంతో సేవలందిస్తున్నాం

### ఆళ్లగడ్డ వీరకిశోర్, ఎంపీడీవో



చాపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలకు సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచుల సహకారంతో అన్ని గ్రామాల ప్రజలకు సేవలు అందిస్తున్నామంటున్న ఎంపీడీవో వీరకిశోర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ముఖాముఖి

**ప్రశ్న:** మండలంలో ఎన్ని గ్రామ సచివాలయాలు ఉన్నాయి.

**జవాబు:** 15

**ప్రశ్న:** ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారు.

**జవాబు:** 5,962 మందికి

**ప్రశ్న:** ప్రతినెలా పింఛన్ ఇస్తున్నారా

**జవాబు:** ఇస్తున్నాం.

**ప్రశ్న:** సిమెంటు రోడ్లకు ఎన్ని నిధులు విడుదల అయ్యాయి.

**జవాబు:** 1.8 కోట్ల రూపాయలు

**ప్రశ్న:** సిమెంటు రోడ్లు ఎన్ని గ్రామాల్లో నిర్మిస్తున్నారు.

**జవాబు:** 20 గ్రామాల్లో

**ప్రశ్న:**ఎంపీటీసీలు ఎంత మంది ఉన్నారు.

**జవాబు:** 12 మంది

**ప్రశ్న:** మండల సర్వసభ్య సమావేశం ఎన్ని రోజులకు నిర్వహిస్తున్నారు.

**జవాబు:** మూడు నెలలకు ఒకసారి.

**ప్రశ్న:** ఎన్ని గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి.

**జవాబు:** 14 వాటికి ఉన్నాయి.

**ప్రశ్న:** గ్రామ సచివాలయాల్లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు.

**జవాబు:** 151 మంది.

**ప్రశ్న:** గ్రామ సచివాలయాల్లో సౌకర్యాలు బాగున్నాయా.

**జవాబు:** బాగున్నాయి.

**ప్రశ్న:** వారంలో ఎన్ని రోజులు గ్రామాలకు వెళుతున్నారు.

**జవాబు:**5 రోజులకు ఒకసారి వెళుతున్నారు.

## భూముల వేలం వాయిదా

దువ్వూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానం భూముల వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎండోమెంటు కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు తెలిపారు. ముందుగా 6వ తేదీన వేలం పాట ఉన్నట్లు కరపత్రం వేయించామన్నారు. గుడిపాడుకు చెందిన ఒకరు ఈ భూముల విషయం కోర్టులో వాజ్యం వేశారని, అందువలన తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారం కట్టించాలని ఎన్‌హెచ్ 440 రహదారి భూ నిర్వాసితులు డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట 20 మంది భూ నిర్వాసితులు నిరసన చేపట్టి తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్తపల్లె పరిధిలో ఉన్న డిమార్ట్ ఎదురుగా ఉన్న సర్వే నంబరు 267లో దాదాపు 40 సంవత్సరాల కిందట ఇళ్లస్థలాలు కొని హద్దులు ఏర్పాటు చేసుకున్నామని ఇప్పుడు ఎన్‌హెచ్ 440 రాయచోటి-చాగలమర్రి వయా ఎర్రగుంట్ల రహదారి మా స్థలాల మీదుగా పోతున్నదని, సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారని తెలిపారు. అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. లేనిపక్షంలో ఇంటి స్థలాల్లో రోడ్డు వెళితే సెంటుకు ఎంత డబ్బులు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందో ముందే తెలియపరచాలన్నారు. గవర్నమెంటు రేటు ప్రకారం కాకుండా ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో గంజాయి కలకలం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో సోమవారం గంజాయి కలకలం చోటుచేసుకుంది. కడప నార్కోటిక్ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు జరగపగా ఇద్దరి వద్ద గంజాయి దొరికింది. వారిని విచారించగా ఎవరి వద్ద కొన్నది తెలిపినట్లు సమాచారం. ఎర్రగుంట్లలో చాలా చోట్ల గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వారు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఎర్రగుంట్లలో ఒక వ్యక్తిపేరు చెప్పినట్లు సమాచారం. రైల్వేస్టేషన్ సమీపం, బస్టాండుల్లో కూడా గంజాయి అమ్ముతున్నట్లుగా గతంలో గుర్తించారు. అయితే ఈవిషయంపై ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేష్‌బాబు మాట్లాడుతూ గంజాయి సేవిస్తున్న ఇద్దరిని కడప నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నట్లు, వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

## రిపబ్లిక్ క్లబ్‌లో అనుమతి పత్రాల పరిశీలన

● అన్నీ సక్రమంగానే ఉన్నాయి - డీఎస్పీ వెంకటేశ్వరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయం పక్కన రిపబ్లిక్ క్లబ్‌ను సోమవారం ఉదయం 10.45 గంటలకు డీఎస్పీ వెంకటేశ్వరరావు, వారి సిబ్బంది తనిఖీ చేశారు. ఆదివారం ఎస్పీ అశోక్ కుమార్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఫిర్యాదు పత్రం అందించడం జరిగింది. దీంతో సోమవారం ఉదయాన్నే జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణ, వారిసిబ్బంది రిపబ్లిక్ క్లబ్‌ను సందర్శించి అక్కడున్న గదులను పరిశీలించారు. క్లబ్‌లో ఉన్న వారి వద్ద నుంచి క్లబ్‌కు సంబంధించిన ఏమైనా అనుమతి పత్రాలు ఉన్నాయా అన్నదానిపై అడిగి వారు ఇచ్చిన పత్రాలను తనిఖీ చేశారు. అలాగే అన్ని గదులను పరిశీలించారు. అనుమతి పత్రాలను పరిశీలించిన తర్వాత అన్నీ సక్రమంగానే ఉన్నట్లు ఈ పత్రాలను జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందని డీఎస్పీ విలేకరుల ఎదుట తెలిపారు. ఏది ఏమైనా జమ్మలమడుగులో పోలీసు అధికారులు క్లబ్‌ను తనిఖీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికారులందరికీ క్లబ్ పత్రాలు అక్కడున్న వ్యక్తులు అందజేశారు.



రిపబ్లిక్ క్లబ్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

## కంపు...కంపు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని కూరగాయల మార్కెట్ వీధిలో పెద్దమ్మ విగ్రహం ఎదురుగా బురుజు ఆంజనేయస్వామి సమీపాన సర్కిల్‌లో దుకాణాల మధ్యలో వచ్చే తీవ్ర కంపుతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు స్పందించలేదని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ అధికారులు స్పందించి దుకాణాల సముదాయానికి సమీపంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఆదారి పక్కనే ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు ఆవరణం నిరుపయోగంగా మారింది. సుమారు ఆ సర్కిల్‌లో 500 పైగా వివిధ దుకాణాలు ఉండడం పెద్దమ్మ విగ్రహం , ఆంజనేయస్వామి గుడి వద్దకు భక్తులు వస్తుంటారు. ఈ కంపుతో స్థానికులు అల్లాడుతున్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి స్పందించి ఆ ప్రాంతంలో పరిశీలించి సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



అపరిశుభ్రంగా ఉన్న వీధి

## ఎంఐజీ ఎన్టీఆర్ లేఅవుట్ పరిశీలన

గోపవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా నియమితులైన కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సోమవారం బద్వేలు పట్టణం సమీపంలోని గోపవరం మండలం శ్రీనివాసపురం వద్ద కుడా అధికారులు, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ సీనియర్‌నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఎంఐజీ ఎన్టీఆర్ లేఅవుట్‌ను పరిశీలించారు. ప్లాట్లు వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని మ్యాప్, స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ త్వరలో లే అవుట్‌ను పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించి ప్రజలకు ప్రభుత్వం తరఫున అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కుడా ఆధ్వర్యంలో మధ్యతరగతి పేద ప్రజలకోసం ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలతో ప్లాట్‌లను ఏర్పాటు చేసి తక్కువ రేటు అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ముక్కా విశాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డికడ, కుడా డీఈ శ్రీకాంత్, ఏపీవో ఆసిఫ్, సీనియర్ నాయకులు నరసింహనాయుడు, సింగసాని బుజ్జి, లాయర్ ప్రసాద్, ఎల్ఎస్‌పీ చైర్మన్ రమణారెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, బోవిళ్ల అమర్‌నాథరెడ్డి కూటమి నేతలు పాల్గొన్నారు.

### కుడా చైర్మన్‌ను సన్మానించిన రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కడప అర్బన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రూపానందరెడ్డిని బద్వేలుకు వచ్చిన సందర్భంగా టీడీపీ కార్యాలయంలో రితేష్‌కుమార్‌రెడ్డి, ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమస్యలపై చర్చించుకున్నారు.

## కాశినాయన ఆలయ అభివృద్ధికి సహకరించండి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని కాశినాయన ఆలయ అభివృద్ధికి సహకరించాలని రితేష్‌రెడ్డి సోమవారం జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్‌ను కలిశారు. కడపలో అటవీశాఖ కార్యాలయంలో ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం అటవీశాఖ అధికారికి కాశినాయనక్షేత్రం సమస్యలను వివరించారు. అలాగే శివరాత్రిని దృష్టిలో పెట్టుకొని లంకమల్ల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డు మరమ్మతులకు అనుమతులు ఇవ్వాలని చర్చించినట్లు తెలిపారు.



అటవీశాఖ అధికారితో రితేష్‌రెడ్డి

## రేపు మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి):కాశినాయన మండల సర్వసభ్య సమావేశం ఈనెల 5వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మైథిలీరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపురంలోని వెలుగు కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు,సర్పంచులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

## స్థలం కోసం ఘర్షణ

### ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామంలో స్థలం కోసం ఘర్షణ పడి వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ఆంజనేయ కొట్టాలుకు చెందిన నాగేశ్వరరెడ్డి, ప్రభాకర్ ఇంటి వద్ద రేకులషెడ్డు బిగించుకుంటుండగా వెంకటేశ్వరరెడ్డి అభ్యంతరం చెప్పడంతో ఘర్షణ పడగా ముగ్గురికీ స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

## మైదుకూరుకు చేరుకున్న మాధవుడు

మైదుకూరు రూరల్,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) :లక్ష్మీ మాధవరాయస్వామి సంక్రాంతి పండుగ పార్వేట రోజున మైదుకూరు నుంచి బయలుదేరారు. అనంతరం మైదుకూరు పరిసరాల్లోని 16 పల్లెలకు వెళ్లి అక్కడ పూజలు, ఊరేగింపులు జరిగి ఆదివారం మైదుకూరుకు చేరుకున్నారు. కాగా సోమవారం భక్తుల సమక్షంలో ఆలయంలో లక్ష్మీమాధవ రాయస్వామికి ప్రత్యేక పూజలు, కల్యాణం చేసి పట్టణంలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఘనంగా వసంత పంచమి వేడుకలు

● చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా చదువులతల్లి సరస్వతీదేవికి ఆలయాలు, పాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులపై సరస్వతీదేవి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ అక్షరాభ్యాసం చేయిచారు. వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరం పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలో సరస్వతీపూజ నిర్వవహించారు.

**కొండాపురం..:** చిత్రావతి నదీ తీరాన వెలసిన సరస్వతీ దేవి ఆలయంలో వసంతపంచమి సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సరస్వతీ నమస్తుభ్యం అంటూ తమ పిల్లలచేత తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం గండికోట బ్యాక్‌వాటర్‌లో ఉన్నప్పటికీ మోటార్ల ద్వారా నీటిని డీవాటరింగ్ చేస్తూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**మైలవరం..:** వసంత పంచమి సందర్భంగా మండల పరిధిలోని వేపరాలలోని సరస్వతి, విద్యామందిరంలో మైలవరంలోని ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవికి విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తులసి మాట్లాడుతూ జ్ఞానానికి ఆదిదేవత సరస్వతి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బద్వేలు రూరల్..:** స్థానిక పోరుమామిళ్లరోడ్డులో ఉన్న సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం వసంతపంచమిని పురస్కరించుకొని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సరస్వతీమాత పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాసరనుంచి తెప్పించిన పవిత్రమైన కుంకుమతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 3 నుంచి 5సంవత్సరాలలోపు వయస్సుగల దాదాపు 100 మంది పిల్లలు అక్షరాభ్యాసం చేయించుకున్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు రామకోటిరాజు, శిశు మందిరం గౌరవాధ్యక్షులు కొండపల్లె వెంకటసుభాష్‌కుమార్, సుధాకర్, బోలా నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, కొండాపురంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



# చిటిమిటిచింతల గ్రామ ప్రజలను ఆదుకోవాలి

నిరసన కార్యక్రమంలో బాధితులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణి స్టీల్‌ప్లాంట్ నిర్మాణంలో ఇళ్ల,భూమి, బళ్లారి కృష్ణపట్నం రోడ్డు నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన చిటిమిటిచింతల సుగాళి తండా గ్రామ ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, స్థానిక సీపీఐ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ముందుగా వారు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా మా భూమి మాకే ఇవ్వాలి, తమకు న్యాయం జరిగేదాకా పోరాటం. వెనక్కి తగ్గేది లేదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ చిటిమిటిచింతల గ్రామ ప్రజలకు ఇళ్లస్థలాలు, సాగుభూమి ఇచ్చేవరకు పోరాటం ఆగదన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, నియోజకవర్గ నాయకులు ప్రసాద్, మనోహర్‌బాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మధు, శ్రీనివాసులు, శంకర్, సుబ్బన్న, నాగేంద్ర, బాలాజీనాయక్, హనుమంతునాయక్, సోమల నాయక్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, చిటిమిటి చింతల ప్రజలు

## జగనన్న కాలనీకి వసతులు కల్పించాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో నగరపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ 2014లో టీడీపీ ఆధ్వర్యంలో మొదలు పెట్టిన ఇళ్లు పూర్తి కాకుండానే ఆగిపోయాయన్నారు. ఇందుకోసం డిపాజిట్లు సేకరించిందన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.1.80లక్షలు మంజూరు చేసిందన్నారు. 90 శాతం పూర్తయిన అపార్ట్‌మెంట్స్‌ను కూడా ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. నీటి, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించి ప్రారంభించేందుకు తగిన నిధులకు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, వచ్చిన వెంటనే పూర్తిచేస్తామని కమిషనర్ శేషఫణి తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవీసుబ్బారెడ్డి, భవానిశంకర్, నారాయణ, ఓబులరెడ్డి పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ఆందోళన చేస్తున్న దృశ్యం